# తొలి వెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..







నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 07 | పేజీలు : 4 | గురువారం | 15 జనవరి 2026 | వెల : 2/-


## బార్డర్ లో పాక్ డ్రోన్ల కలకలం..

### - కాల్పులు జరిపిన సైన్యం

- రాజౌరీ సమీపంలో ఎల్వోసీ వద్ద చక్కర్లు కొట్టిన పాక్ డ్రోన్లు
- 48 గంటల్లోనే రెండుసార్లు మన సరిహద్దుల్లోకి రాక..
- మంగళవారం రాత్రి ఘటన.. బార్డర్ వెంబడి తనిఖీ చేపట్టిన సోల్జర్లు



వివరాలు 2 లో..

## అప్పుల పాలైన భర్త కోసం

## దొంగగా మారిన భార్య

- గతంలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా ఉద్యోగం చేసిన మహిళ
- అవంతీనగర్ లో వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెల తాడు అపహరణ
- సీసీటీవీ ఫుటేజీల సాయంతో అరగంటలోనే పట్టుకున్న పోలీసులు

వివరాలు 2 లో..

## శబరిమలలో కనులపండువగా

# మకరజ్యోతి దర్శనం

### - పులకించిన భక్తులు



- అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన శబరిగిరి కొండలు
- పొన్నాంబలమేడుపై మూడుసార్లు కనిపించిన దివ్యజ్యోతి
- తిరువాభరణాల అలంకరణ తర్వాత జరిగిన ప్రత్యేక పూజలు
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో నిండిపోయిన సన్నిధానం




డెస్క్, జనవరి 14 (తొలి వెలుగు) : కేరళలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శబరిమలలో మకరజ్యోతి దర్శనం అశేష భక్తజన సందోహం మధ్య కనులపండువగా జరిగింది. మకర సంక్రాంతి పుణ్యదినమైన బుధవారం సాయంత్రం 6:30 గంటల తర్వాత పొన్నాంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు భక్తులకు దర్శనమిచ్చింది. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించిన లక్షలాది మంది భక్తులు "స్వామియే శరణం అయ్యప్ప" అంటూ చేసిన శరణుఘోషతో శబరిగిరులు మార్మోగిపోయాయి. అంతకుముందు, పందళం రాజప్రాసాదం నుంచి తీసుకొచ్చిన పవిత్రమైన తిరువాభరణాలను అయ్యప్ప స్వామికి అలంకరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక దీపారాధన నిర్వహించారు. ఆ వెంటనే పొన్నాంబలమేడు కొండపై దివ్యజ్యోతి కనిపించడంతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. మకరజ్యోతిని సాక్షాత్తు అయ్యప్ప స్వామి జ్యోతిర్మయ రూపంగా భక్తులు విశ్వసిస్తారు. ఈ జ్యోతిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోయి, కోరిన కోరికలు నెరవేరతాయని ప్రగాఢంగా నమ్ముతారు. మకరజ్యోతి దర్శనం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. రద్దీని నియంత్రించేందుకు కొండపైకి పరిమిత సంఖ్యలోనే భక్తులను అనుమతించారు. క్షేత్రానికి రాలేని భక్తుల కోసం పలు టీవీ ఛానెళ్లు, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందించాయి. ఏటా మకర సంక్రాంతి నాడు జరిగే ఈ వేడుక కోసం దేశ నలుమూలల నుంచి భక్తులు 41 రోజుల కఠిన దీక్షతో శబరిమలకు చేరుకుంటారు.

## బ్యాంకాక్ వెళుతుండగా ఎన్టీవీ ఇన్పుట్ ఎడిటర్

# దొంతు రమేశ్ అరెస్ట్

### - హరీశ్ రావు ఖండన..!

- ఎన్టీవీ తెలంగాణ ఇన్పుట్ ఎడిటర్ దొంతు రమేశ్ అరెస్ట్
- ఆయనతో పాటు మరో ఇద్దరు జర్నలిస్టులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అరెస్టులను తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి హరీశ్ రావు
- ఇది ప్రజాస్వామ్యంపై దాడేనని బీఆర్ఎస్ ఆరోపణ

2



## నోటీసులు ఇస్తే సరిపోతుంది కదా

## ఇంత దౌర్జన్యం అవసరమా..?

### - కేటీఆర్

తెలంగాణలో ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు కిడ్నాప్ చేశారన్న కేటీఆర్

రాజ్యాంగ హక్కులను రేవంత్ సర్కార్ కాలరాస్తోందని తీవ్ర ఆరోపణ

ఇదేనా మీ 'మొహబ్బత్ కీ దుకాణ్ణ అంటూ రాహుల్ గాంధీకి ప్రశ్న

మీడియాపై దాడులు రేవంత్ పాలనకు నిదర్శనమని విమర్శ

బెయిల్ వచ్చే సెక్షన్లకే ఇంత దౌర్జన్యమా అని నిలదీత



వివరాలు 2 లో..

## ములుగు జిల్లాను తొలగిస్తున్నారని ప్రచారం

### - స్పందించిన మంత్రి సీతక్క

- ములుగు జిల్లాను తొలగిస్తారనే ప్రచారాన్ని విశ్వసించవద్దన్న మంత్రి
- పలు యూట్యూబ్ ఛానళ్ల ద్వారా జిల్లాపై తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని విమర్శ
- జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ



డెస్క్, జనవరి 14 (తొలి వెలుగు) : ములుగు జిల్లాను తొలగిస్తున్నారంటూ జరుగుతోన్న ప్రచారంపై మంత్రి సీతక్క స్పందించారు. తెలంగాణలో ఇటీవల జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం చర్చకు దారి తీసింది. వివిధ జిల్లాలు రద్దవుతున్నాయంటూ ఆయా జిల్లాల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఈ ప్రచారాన్ని ఆయా జిల్లాలకు సంబంధించిన అధికార పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు ఖండిస్తున్నారు. జనగామ జిల్లా రద్దవుతోందంటూ రెండు రోజుల క్రితం ప్రచారం జరగగా, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఖండించారు. తాజాగా ములుగు జిల్లాపై అలాంటి ప్రచారం సాగుతోంది. ములుగు జిల్లాను తొలగిస్తున్నారని జరుగుతోన్న ప్రచారాన్ని విశ్వసించవద్దని మంత్రి సీతక్క అన్నారు. పలు యూట్యూబ్ ఛానళ్ల ద్వారా జిల్లాపై తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై బురద జల్లేందుకే ఈ విధంగా ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. అందుకే మరోసారి జిల్లాల పునర్విభజన గురించి ముఖ్యమంత్రి మాట్లాడారని తెలిపారు. ములుగు జిల్లా అభివృద్ధిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఆమె తెలిపారు. ఎందరో పోరాటాలు, త్యాగాల వల్ల ములుగు జిల్లా ఏర్పడిందని అన్నారు.

## కేసీఆర్‌ను విమర్శించడానికి

# మేం అవసరం లేదు.. ఆమె చాలు

### - కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని ఆరోపణ
- కేసీఆర్ చేసిన అప్పులను తీరుస్తున్నామన్న మంత్రి
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



డెస్క్, జనవరి 14 (తొలి వెలుగు) : బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శించేందుకు తాము అవసరం లేదని, ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరిపోతారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే, వాటిని తమ ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. అప్పులు తీరుస్తూనే రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ వల్ల పాలమూరుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండగా, రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి మోసాలు చేయాలని చూస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. కేసీఆర్ మాత్రం ఏదో ఒకరోజు మాత్రమే పనుల కోసం సమయం కేటాయించారని విమర్శించారు. అందుకే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. వివిధ పథకాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. మరో ఇరవై రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లేని పార్టీలకు ఓటు వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అన్నారు. పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలిచామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెబుతున్నారని, పార్టీ గుర్తుతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని ఆయన సవాల్ విసిరారు.



### బ్యాంకాక్ వెళుతుండగా ఎన్టీవీ ఇన్పుట్ ఎడిటర్

# దొంతు రమేశ్ అరెస్ట్ - హరీశ్ రావు ఖండన..!

మొదటిపేజీ తరువాయి..

డెస్క్, జనవరి 14 (తొలి వెలుగు) : ప్రముఖ న్యూస్ ఛానెల్ ఎన్టీవీ తెలంగాణ ఇన్పుట్ ఎడిటర్ దొంతు రమేశ్‌ను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు అదే సంస్థకు చెందిన మరో ఇద్దరు జర్నలిస్టులను కూడా అదుపులోకి తీసుకోవడం మీడియా వర్గాల్లో కలకలం రేపింది.

వివరాల్లోకి వెళ్తే, బుధవారం ఉదయం దొంతు రమేశ్ బ్యాంకాక్ వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా, పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు జర్నలిస్టులు చారి, సుధీర్‌లను కూడా అరెస్ట్ చేసినట్లు సమాచారం. అయితే, ఏ కేసులో వీరిని అరెస్ట్ చేశారనే విషయంపై పోలీసులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అరెస్టుకు గల కచ్చితమైన కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది.

జర్నలిస్టుల అరెస్టును బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని, మీడియా గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. "అర్ధరాత్రి ఇళ్లపై పడి అరెస్ట్ చేయడానికి వాళ్లేమైనా ఉగ్రవాదులా?" అని ప్రభుత్వాన్ని ఆయన తీవ్రస్థాయిలో నిలదీశారు. ఈ విషయంపై డీజీపీతో ఫోన్‌లో మాట్లాడినట్లు కూడా హరీశ్ రావు తెలిపారు.

ప్రస్తుతం అదుపులోకి తీసుకున్న ముగ్గురు జర్నలిస్టులు సీసీఎస్ పోలీసుల కస్టడీలో ఉన్నారు. ఈ ఘటన తెలంగాణ రాజకీయ, మీడియా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రీన్ గ్రోవ్ లో సంప్రదాయ శోభ

- ❖ గోదాదేవి కల్యాణం, భోగి మంటలతో సందడి
- ❖ అబ్బురపరిచిన విద్యార్థుల వేషధారణ
- ❖ సమాజానికి బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దుతాం: బండి వీణ అనిల్ రెడ్డి







చౌటుప్పల్, జనవరి 14 (తొలివెలుగు) : చౌటుప్పల్ పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. బుధవారం జరిగిన భోగి వేడుకల్లో భాగంగా విద్యార్థులు గోదాదేవి, శ్రీకృష్ణుడు తదితర పౌరాణిక పాత్రల వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో భోగి మంటల చుట్టూ నిర్వహించిన కార్యక్రమాలు, గోదాదేవి కల్యాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభ, వేషధారణను చూసిన తల్లిదండ్రులు, అతిథులు ముచ్చటపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ బండి వీణ అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక డిజిటల్ విద్యతో పాటు నైతిక విలువలు, భారతీయ సంప్రదాయాలను విద్యార్థులకు అలవర్చడమే గ్రీన్ గ్రోవ్ స్కూల్స్ లక్ష్యమని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, సురక్షితమైన వాతావరణంలో విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ క్లాసులు, క్రీడలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల ద్వారా విద్యార్థులను సమాజానికి బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ.. చదువుతో పాటు సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇచ్చే ఈ పాఠశాలలో తమ పిల్లలు చదువుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్. లక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

- ❖ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి
- ❖ సీఐటీయు జిల్లా కోశాధికారి ఎండి పాషా





చౌటుప్పల్, జనవరి 14 (తొలివెలుగు) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు చెరుకు బావి కాలనీ, తంగేడుపల్లి కాలనీల్లో అఖిల భారత మహిళా సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయు జిల్లా కోశాధికారి ఎండి పాషా విజేతలకు అభినందనలు తెలిపారు. మహిళలు కేవలం గృహానికే పరిమితం కాకుండా రాజకీయ, ఆర్థిక రంగాల్లో పురుషులతో సమానంగా ఎదగాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం సాగే పోరాటాల్లో మహిళలు ముందుండాలని కోరారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు బండారు నరసింహ, ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షులు గోశిక కరుణాకర్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బత్తుల దాసు, మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు బత్తుల జయమ్మ, డివైఎఫ్ఐ నాయకులు దాసరి శివ, ఎస్ఎఫ్ఐ మున్సిపల్ అధ్యక్షులు దాసరి ప్రకాష్, నాయకులు సిలువేరు జంగయ్య, చీకూరి ఈదయ, కొంగరి కనకయ్య, బొడ్డు రాజు, రాములు, పంతంగి సోమరాజ్, వీరమల్ల యాదయ్య, యాదమ్మ, సంధ్య, ఎల్లంకి సైదులు, బండారు విక్రమ్, నాగమణి, వెన్నెల, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

### బార్డర్ లో పాక్ డ్రోన్ల కలకలం..

# కాల్పులు జరిపిన సైన్యం

మొదటిపేజీ తరువాయి..

డెస్క్, జనవరి 14 (తొలి వెలుగు) : పాకిస్థాన్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. భారత సరిహద్దుల్లోకి డ్రోన్లను పంపిస్తోంది. మంగళవారం జమ్మూకశ్మీర్ లోని రాజౌరీ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో డ్రోన్లను గుర్తించినట్లు సైన్యం పేర్కొంది. బార్డర్ దాటి వచ్చిన పాక్ డ్రోన్లపై కాల్పులు జరిపినట్లు తెలిపింది. అంతలోనే అవి మాయమయ్యాయని ఓ ప్రకటనలో తెలిపింది. గడిచిన 48 గంటల్లోనే పాక్ డ్రోన్లు మన సరిహద్దుల్లోకి రావడం ఇది రెండోసారి అని సైనిక అధికారులు తెలిపారు. రాత్రి 7:30 గంటల ప్రాంతంలో రాజౌరీ జిల్లాలోని దుంగా గాలా ప్రాంతంలో పాక్ డ్రోన్లను గుర్తించినట్లు చెప్పారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ నుంచి వచ్చిన ఈ డ్రోన్లపై కాల్పులు జరపగా.. వెంటనే వెనక్కి వెళ్లిపోయాయని వివరించారు. కాగా, ఈ డ్రోన్ల ద్వారా మాదకద్రవ్యాల రవాణా కానీ అక్రమ ఆయుధాల వ్యాపారం కానీ జరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో డ్రోన్ల కదలికలు గుర్తించిన ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సైన్యం తనిఖీలు చేపట్టింది. డ్రోన్ల ద్వారా ఏవైనా ప్యాకెట్లు జారవిడిచి ఉండే అవకాశం ఉందని అధికారులు అనుమానిస్తున్నారు.

# నోటీసులు ఇస్తే సరిపోతుంది కదా.. ఇంత దౌర్జన్యం అవసరమా..? - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..



డెస్క్, జనవరి 14 (తొలి వెలుగు) : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు అపహరించారని ఆరోపిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆయన ఘాటుగా స్పందించారు.

"రాహుల్ గాంధీ గారూ.. మీరు నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్ల తెలంగాణ శాఖ, పౌరుల రాజ్యాంగ హక్కులను ఎలా కాలరాస్తోందో గమనిస్తున్నారని ఆశిస్తున్నా" అని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మంగళవారం రాత్రి రాష్ట్ర పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అపహరించారని, ఒకరి ఇంటి తలుపులు బద్దలుకొట్టి మరీ లోపలికి ప్రవేశించారని ఆరోపించారు. కేవలం బెయిల్ ఇవ్వదగిన సెక్షన్లు ఉన్న కేసులో, బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం అవసరమా అని ఆయన ప్రశ్నించారు. మీడియా, డిజిటల్ మీడియాపై ఈ తరహా అణచివేత ధోరణి ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనకు ఒక నమూనాగా మారిందని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# అప్పుల పాలైన భర్త కోసం దొంగగా మారిన భార్య



డెస్క్, జనవరి 14 (తొలి వెలుగు) : వ్యాపారంలో నష్టపోయి అప్పుల పాలైన భర్త కోసం తాను కూడా కష్టపడాలని, డబ్బు సంపాదించాలని భార్య నిర్ణయించుకుంది.. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించడానికి దొంగగా మారింది. ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లింది. హైదరాబాద్ లోని సనత్ నగర్ ప్రాంతం అవంతీనగర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. అరగంటలోనే దొంగను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..

వరంగల్ కు చెందిన అనితా రెడ్డి ఉన్నత చదువులు చదివి చెన్నైలో కొంతకాలం సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసింది. మేడ్చల్ కు చెందిన రాజేశ్ తో రెండేళ్ల క్రితం ఆమెకు వివాహం జరిగింది. ఈ దంపతులకు ఓ పాప ఉంది. రాజేశ్ చేస్తున్న ఫైనాన్స్ వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు భర్త పడుతున్న బాధను చూడలేక తాను కూడా డబ్బు సంపాదించాలని అనిత దొంగగా మారింది.

ఈ నెల 13న అవంతీనగర్ లో ఓ వృద్ధురాలిని వెంబడించిన అనిత.. బిల్డింగ్ లిఫ్ట్ లో ఆమె మెడలోని మంగళసూత్రం కొట్టేసి పారిపోయింది. బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు అనితను గుర్తించి అరగంటలోనే అదుపులోకి తీసుకున్నారు. భర్త చేసిన అప్పులు తీర్చడానికే దొంగతనం చేసినట్లు అనిత పోలీసులకు వెల్లడించింది.

# గ్రామీణ క్రీడలకు దక్కని ప్రోత్సాహం

- మట్టిలో మాణిక్యాలకు సర్కారు 'కళ్లెం'
- బడ్జెట్ కేటాయింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విఫలం
- క్రీడలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం
- యువత అన్ని రంగాల్లో రాణించాలి
- పులిగిల్లలో ఉత్సాహంగా సాగిన కబడ్డీ, వాలీబాల్ పోటీలు
- రైతు సంఘం జిల్లా నాయకుడు: కళ్లెం సుదర్శన్‌రెడ్డి





వలిగొండ, జనవరి 14 (తొలివెలుగు) : గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతు సంఘం జిల్లా నాయకుడు కళ్లెం సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పులిగిల్ల గ్రామంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల పట్ల ఎంతో ఆసక్తి చూపుతున్నారని, వారు మట్టిలో మాణిక్యాలని కొనియాడారు. పాలక ప్రభుత్వాలు మారుతున్నా క్రీడలకు బడ్జెట్ కేటాయించడంలో మాత్రం చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు క్రీడల పట్ల తమ వైఖరిని స్పష్టం చేయలేకపోయాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు సిర్పంగి స్వామి, గ్రామ సర్పంచ్ పల్లెర్ల అనుష, మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, నాయకులు వాకిటి వెంకటరెడ్డి, మారబోయిన నరసింహ, బుగ్గ చంద్రమౌళి, వేముల ఆనంద్, అమరేందర్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు వడ్డమాను మధు, వేముల జ్యోతిబాసు, మారబోయిన ప్రశాంత్, సతీష్, వేముల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



చౌటుప్పల్, జనవరి 14 (తొలివెలుగు) : పేద కుటుంబానికి అండగా నిలిచి చెరుకు శివకుమార్ గౌడ్ తన ఉదారతను చాటుకున్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డు రామ్‌నగర్ కాలనీకి చెందిన సానబోయిన లింగస్వామి గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చెరుకు శివకుమార్ గౌడ్ బుధవారం మృతుని నివాసానికి వెళ్లి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, తక్షణ సాయంగా రూ.6,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్యామల లింగస్వామి, బొంగు బాబు, బొమ్మిరెడ్డి జీవన్ రెడ్డి, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు

- రంగురంగుల ముగ్గులు.. పతంగుల కేరింతలు
- రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్





భువనగిరి, జనవరి 14 (తొలివెలుగు): మండలంలోని అనాజీపురం గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కాంగ్రెస్ నాయకులు, 9వ వార్డు సభ్యులు మైలారం నగ్మా-వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ముగ్గుల పోటీలు, పతంగుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, ప్రతి ఇంటా సంక్రాంతి వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయపురం సురేష్, ఉపసర్పంచ్ వెలిశాల మురళి, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు గోగు శ్రీనివాస్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ గుణగంట్ల కల్పన శ్రీనివాస్, వార్డు సభ్యులు బొల్లపల్లి అశోక్, నోముల జ్యోతి వెంకటేష్, గడుగు నరేష్, ఎనగండ్ల సుధాకర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు ఎండి కరీం తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# పదేళ్ల శ్రమ 'జేసీబీ' పాలు!

- కొత్తగూడెంలో హరితహారం చెట్ల తొలగింపు
- అధికారుల తీరుపై కాంగ్రెస్ నాయకుల ధ్వజం
- సర్పంచ్, కార్యదర్శిపై చర్యలకు డిమాండ్



సంస్థాన్ నారాయణపురం, జనవరి 14 (తొలివెలుగు) : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామ పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న హరితహారం చెట్లను జేసీబీతో తొలగించడంపై కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచకొండ జంగయ్య ఆధ్వర్యంలో నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా ఉపాధి హామీ కూలీలు, నర్సరీల ద్వారా ఎంతో శ్రమించి పెంచిన మొక్కలను ఇలా నిర్లక్ష్యంగా తొలగించడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండకాలం వస్తున్న తరుణంలో నీడనిచ్చే చెట్లను కాపాడాల్సింది పోయి, తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ఘటనపై విచారణ జరిపి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచకొండ జంగయ్య, నాయకులు బాలగోని మల్లేష్ గౌడ్, రెండవ వార్డు సభ్యుడు బాలగోని మల్లేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పంగరెక్క యాదయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బాలాజీ రామకృష్ణ స్వామి కళ్యాణ పత్రిక ఆవిష్కరణ

- అంగరంగ వైభవంగా రజతోత్సవ వేడుకలు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయ కమిటీ



చౌటుప్పల్, జనవరి 14 (తొలివెలుగు) : చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులోని శ్రీ అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ బాలాజీ రామకృష్ణ (వెంకటేశ్వర స్వామి) వారి రజతోత్సవ కళ్యాణ మహోత్సవ పత్రికను బుధవారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు నాగిళ్ల రామచంద్రం మాట్లాడుతూ.. స్వామివారి రజతోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి, ఊదరి శ్యామ్, ఉప్పుగుల శ్రీను, చింతల దామోదర్ రెడ్డి, బత్తుల శ్రీశైలం, గుజ్జుల సురేందర్ రెడ్డి, మంచికంటి భాస్కర్ గుప్తా, ఆరుట్ల లింగస్వామి, కాసుల వెంకటేష్, తొర్పునూరి మల్లేష్, నల్ల పర్వతాలు, గణేష్, నకరకంటి శ్రీశైలం, ఊదరి మారయ్య, యాదయ్య, చేవగోని మహేష్, గంగిరెడ్డి నాగలక్ష్మి, జక్కర్తి శేఖర్, గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సంతోష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మాట తప్పని 'భాస్కర్'.. బడి నిర్మాణానికి శ్రీకారం

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఇఎల్‌వి ఫౌండేషన్
- అల్లందేవిచెర్వులో విద్యా వికాసానికి అడుగు
- ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడిని తీర్చిదిద్దుతాం
- ఘనంగా పాఠశాల భవన శంకుస్థాపన
- చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ చొరవపై సర్వత్రా హర్షం






సంస్థాన్ నారాయణపురం, జనవరి 14 (తొలివెలుగు) : ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని ఇఎల్‌వి ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ నెల రోజుల్లోనే నెరవేర్చారు. అల్లందేవిచెర్వు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదులు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన, నూతన భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఎదగాలన్నదే తమ ఫౌండేషన్ ఆశయమన్నారు. పేద విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం అప్పులు చేసి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే దుస్థితి మారాలని ఆకాంక్షించారు. కొత్త భవనం అందుబాటులోకి వస్తే అల్లందేవిచెర్వుతో పాటు నాగవారిగూడెం, గొల్లగూడెం విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇఎల్‌వి ఫౌండేషన్ డైరెక్టర్ ఇరగదిండ్ల అశోక్, సర్పంచుల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్, ఎంఈఓ శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకసేన, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు ఉప్పల రమేష్ గౌడ్, కత్తుల వాసు, ముక్కర్ల కవిత స్వామి యాదవ్, కిరణ్, కట్కూరి భాస్కర్ గౌడ్, ఎలిజాల శీను, వివిధ పార్టీల నాయకులు సంపతి సుధాకర్ రెడ్డి, సుర్వి సురేష్ గౌడ్, ఏర్పుల రాజేష్, గుండు జంగయ్య గౌడ్, వార్డు సభ్యులు వంటల సువర్ణ, సుర్వి కృష్ణవేణి, సుర్వి వినోద్ కుమార్ గౌడ్, అంతటి శివశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు

- ఆత్మకూర్(ఎం)లో సంక్రాంతి క్రీడోత్సవాలు
- శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి





ఆత్మకూర్(ఎం), జనవరి 14 (తొలివెలుగు): మండల కేంద్రంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో, కెహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న గ్రామీణ క్రీడోత్సవాల్లో భాగంగా భోగి పర్వదినం నాడు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన సంస్కృతీ సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకలని, గ్రామీణ యువతలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బీసు ధనలక్ష్మీ చందర్ గౌడ్, శివాజీ యువజన మండలి అధ్యక్షులు, ఉపసర్పంచ్ మజ్జిగ నరేశ్, ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్, మాజీ అధ్యక్షులు కోరే మల్లేష్, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి తడిసిన మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, మండల బీజేపీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు పోతగాని మల్లేశం, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు లోడి వెంకటయ్య, వార్డు సభ్యులు రంగ సంధ్యారాణి శ్రీనివాస్, నోముల రజిత యాదగిరి, పైల్ల ప్రసన్న ప్రశాంత్, లోడి శ్రీనివాస్, గట్టు విశాల్, రాగటి మచ్చగిరి, కొంగరి పుష్పలత పరుషరాములు, బూడిద శేఖర్, ఎలగందుల సైదులు, అఖిలపక్ష నాయకులు యాస ఇంద్రారెడ్డి, తౌర్ర విష్ణు, కోరే బిక్షపతి, సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి, లోడి శ్రీను, బొబ్బల ఇంద్రారెడ్డి, నోముల వెంకట్ రెడ్డి, బొబ్బల లాల్ రెడ్డి, నాతి రాజు, రంగ స్వామి, శివాజీ యువజన మండలి సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భక్తిశ్రద్ధలతో భోగి వేడుకలు

- సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- వేడుకగా భోగి పూజలు.. పాల్గొన్న సర్పంచ్ జువ్వి నరసింహ
- ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు



చౌటుప్పల్, జనవరి 14 (తొలివెలుగు) : చౌటుప్పల్ మండల పరిధిలోని ధర్మాజీగూడెం గ్రామంలో భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ జువ్వి నరసింహ, ఆలయ పాలకవర్గ సభ్యులతో కలిసి స్థానిక శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోగి పండుగ ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలను తీసుకురావాలని కోరుకుంటూ గ్రామ ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దేవాలయ పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యారంగంపై కేంద్రం 'అధిష్టాన్' గొడ్డలిపెట్టు!

చౌటుప్పల్, జనవరి 14 (తొలివెలుగు) : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025'ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు డిమాండ్ చేశారు. ఈ బిల్లుతో విద్యారంగంపై కేంద్ర ప్రభుత్వం గొడ్డలిపెట్టు వేస్తోందని, పేదలు, దళితులు, గిరిజనులకు విద్య మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బుధవారం చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) పేరుతో విద్యను కేంద్రీకరిస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. యూజీసీ, ఎన్‌సీఈఆర్‌టీ, ఏఐసీటీఈ వంటి స్వయంప్రతిపత్తి గల సంస్థలను రద్దు చేసి హెచ్ఈసీఐ పరిధిలోకి తీసుకురావడం విద్యా స్వాతంత్ర్యానికి విఘాతం కలిగిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పాఠశాలలను మూసివేసి, లక్షలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా విద్యను ప్రైవేటు పరం చేయడం విద్యా ద్రోహమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రిని నియమించాలని, చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలోని గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టళ్లను పునరుద్ధరించాలని తెలిపారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, మండల నాయకులు శ్రవణ్ రెడ్డి, వరుణ్, విక్రమ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

